## గద్దర్ అవార్డు కరీంనగర్ ప్రజలకు అంకితం: పొన్నం రవిచంద్ర

కమాన్‌చౌరస్తా, జూన్ 15: ఉత్తమ ఫిల్మ్ క్రిటిక్‌గా తాను స్వీకరించిన గద్దర్ అవార్డును కరీంనగర్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు పొన్నం రవిచంద్ర ప్రకటించారు. సమైక్య సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జరిగిన విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను శనివారం స్వీకరించిన గద్దర్ అవార్డును ప్రదర్శించారు.

## లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

చొప్పదండి, జూన్ 15: లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం లయన్స్ క్లబ్ ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2025-26 నూతన లయనిస్టిక్ సంవత్సరానికి సంబంధించి లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి నూతన కార్యవర్గ సభ్యులతో మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ఎండీ 320 లయన్ హన్మాండ్ల రాజిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా లయన్ తొడుపునూరి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్స్‌గా వల్లాల జగన్, లయన్ మామిడి రాజేశ్ పవార్, మాడూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సిరిపురం రాజు, కోశాధికారిగా పిట్టల వెంకటేశ్, ఎల్‌సీఐఎఫ్ కో ఆర్డినేటర్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. విశిష్ట అతిథిగా హాజరైన జిల్లా 320జి మొదటి ఉప గవర్నర్ లయన్ మోర భద్రేశం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో డీసీఎస్ సింగిరెడ్డి వాసుదేవరెడ్డి, జీఎల్‌టీ కో ఆర్డినేటర్ ఇనుగుర్తి రమేశ్, జీఈటీ కో ఆర్డినేటర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, రీజియన్ చైర్మన్ కొల్లూరి జితేందర్, జోన్ చైర్మన్ చింతల రవి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## 17న టీజీఎంఈయూ ఆవిర్భావ దినోత్సవం

విద్యానగర్, జూన్ 15: తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 17న ఘనంగా జరుపుకోవాలని టీజీఎంఈయూ రాష్ట్ర కార్యదర్శి, కామ్రేడ్ టీ రామారావు ఒక ప్రకటనలో కోరారు. యూనియన్‌లో ఉన్న అన్ని క్యాడర్ల ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేసి, విజయం సాధించడంపై గర్విస్తున్నామని పేర్కొన్నారు. తోటి ఉద్యోగులైన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజ్ అయ్యే వరకు వారు చేసే పోరాటాలకు యూనియన్ అండగా ఉంటుందని ప్రకటించారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 15: నగరంలో 11కేవీ ఫీడర్లకు మరమ్మతులు చేపడుతున్నందున సోమవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2 ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, లావణ్య పేర్కొన్నారు. ఉదయం 7.30నుంచి 10.30గంటల వరకు ఇంగ్లిష్ యూనియన్ స్కూల్ ఏరియా, మోర్ సూపర్ మార్కెట్, రాధా నిలయం, కవిత వెడ్డింగ్ మాల్ వెనుక ప్రాంతం, ఉదయం 8నుంచి 10గంటల వరకు శ్రీనగర్ కాలనీ, భవానీ కాలనీ, గోదాం గడ్డ, గోదాం వెనుక ప్రాంతం, బీఎస్ఎఫ్ క్వార్టర్స్, భగత్ నగర్, సంతోషి మాతా టెంపుల్, జడ్పీ క్వార్టర్స్, మొండయ్య హోటల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## రెడ్డి ఐక్యవేదిక నాయకుల పరామర్శ



రేకొండలో మాజీ ఎంపీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

చిగురుమామిడి, జూన్ 15: మండలంలోని రెడ్డి సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. కరీంనగర్‌లో ప్రముఖ వైద్యుడు డాక్టర్ భూంరెడ్డి, రేకొండలో మాజీ ఎంపీటీసీ చాడ శోభ ఇటీవల మృతి చెందగా, వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు చేసిన సేవలను కొనియాడారు. పరామర్శించిన వారిలో ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు పోటు మల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతాల మైపాల్ రెడ్డి, గౌరవాధ్యక్షులు వంటకాల సంపత్ రెడ్డి, సంధిరాజు రెడ్డి, నాయకులు లచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, నాగెల్లి రాజిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, కాటం సంపత్ రెడ్డి, అశోక్ రెడ్డి, కాటం తిరుపతిరెడ్డి ఉన్నారు.

## సెల్‌ఫోన్ అందజేత

వీణవంక, జూన్ 15: మండలంలోని ఎలుబాక గ్రామానికి చెందిన ఊట్ల సహన మే నెలలో సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా దానిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో సహనకు ఎస్ఐ తిరుపతి అందజేశారు.

# పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- విలీన గ్రామాల్లో చెత్త సేకరణపై పర్యవేక్షణ లోపం
- పారిశుధ్య సిబ్బంది ఇష్టారాజ్యం
- డీఆర్‌సీసీ కేంద్రాలకు తరలించకుండా రోడ్ల పక్కనే పడేస్తున్న వైనం



చింతకుంట నుంచి యూనివర్సిటీ రోడ్డులో రోడ్డు పక్కన వేసిన చెత్త

**కరీంనగర్ నగరపాలక సంస్థ విలీన గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్త సేకరణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, సిబ్బంది ఇష్టారీతిగా వ్యవహరిస్తుండడం వెరసి ప్రజలకు శాపంగా పరిణమించింది. వానకాలం ప్రారంభమైనందున వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండగా, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దాల్సిన అవసరం ఉన్నది.**

కార్పొరేషన్, జూన్ 15: నగరాలు, పట్టణాల్లో విలీనం అయితే తమ ప్రాంతాల్లో పట్టణీకరణ మార్పులు వస్తాయని అందరూ ఆశిస్తారు. కానీ, నగరపాలక సంస్థలో విలీనం తర్వాత సమస్యలతో ముఖ్యంగా అస్తవ్యస్తంగా మారిన పారిశుధ్యంతో సతమతమవుతున్నారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డీఆర్‌సీసీ కేంద్రాలకు పంపించి డంప్ యార్డుకు వచ్చే చెత్తను తగ్గించాలని ఉన్నతాధికారులు చెబుతుంటే.. కింది స్థాయి అధికారులు, సిబ్బంది మాత్రం దానిని మరోలా ఆచరణలో పెడుతున్నారు. సేకరిస్తున్న చెత్తను డంప్‌యార్డుకు పంపకుండా నగరంలో ఎక్కువగా వినియోగంలో లేని రోడ్లను ఎంచుకొని వాటికి ఇరువైపులా పారబోసి చేతులు దులుపుకొంటున్నారు.

### లక్ష్యం ఘనం.. ఆచరణలో విఫలం

నగరాన్ని పరిశుభ్రంగా మార్చి స్వచ్ఛ భారత్‌లో మెరుగైన ర్యాంకులు సాధిస్తామని చెప్పుకొంటున్న నగరపాలక పారిశుధ్య అధికారులు, క్షేత్రస్థాయిలో దానిని ఆచరణలో పెట్టడంలో మాత్రం విఫలమవుతున్నారు. నగరంలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్త ఆయా ప్రాంతాల్లోని వర్మి కంపోస్టు, డీఆర్‌సీసీ కేంద్రాలకు తరలించి మిగిలిన చెత్తను స్థానికంగా ఉన్న డంప్‌యార్డులకు చేరవేయాలి. కానీ, నగరంలోని చింతకుంట నుంచి శాతవాహన యూనివర్సిటీ వెనుక నుంచి వచ్చే రోడ్డుకు ఇరువైపులా గత కొన్ని రోజులు పారిశుధ్య సిబ్బంది చెత్తను పారబోస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆ రోడ్డులో ప్రయాణం చేసే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇప్పటికైనా నగరపాలక ఉన్నతాధికారులు విలీన గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి సారించి, చెత్త సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



చింతకుంటలోని శ్మశాన వాటికలో వేసిన చెత్త

### శ్మశాన వాటికలో చెత్త డంపు

ఇటీవల నగరంలో విలీనమైన చింతకుంటలో సేకరించిన చెత్తను పారిశుధ్య సిబ్బంది ఆ ప్రాంతానికి చెందిన శ్మశాన వాటికలోనే వేస్తున్నారు. ఓ వైపు వాతావరణ కాలుష్యం తగ్గించాలంటే చెత్తను ఎక్కడా కాల్చవద్దు అని మున్సిపల్ అధికారులు ప్రచారం చేస్తున్నారు. మరోవైపు చింతకుంటలో చెత్త పెరిగిపోతున్నదంటూ కాల్చివేయిస్తుండడం గమనార్హం. ఇప్పటికే నగరంలో డంప్‌యార్డులో చెలరేగుతున్న మంటల వల్ల వెలువడుతున్న పొగతో స్థానికంగా ఉండే ప్రజలు అనారోగ్యం బారిన పడుతుండగా, చింతకుంటలో మాత్రం పారిశుధ్య సిబ్బంది స్వయంగా నిప్పంటిస్తున్నారు. శ్మశానవాటికలోనే చెత్త వేయడం, అనంతరం దానిని కాల్చివేస్తుండడంతో అంత్యక్రియలకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## న్యాయం చేయాలని వేడుకోలు

వీణవంక, జూన్ 15: తనను ప్రేమించి, పెళ్లి చేసుకొని కాపురానికి తీసుకుపోకుండా మోసం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలంటూ మల్లారెడ్డిపల్లికి చెందిన నిమ్మల విజయ వేడుకొంది. ఆదివారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనం ఆవరణలో సీపీయూ ఎస్ఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రమేశ్, ఆడజన్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు కలకోటి శారద, జిల్లా కమిటీ సభ్యురాలు రమాదేవితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడింది. మల్లారెడ్డిపల్లి గ్రామానికే చెందిన కొలిపాక రాకేశ్ తనను ప్రేమిస్తున్నానని చెప్పి సంవత్సరం క్రితం ఓ ఆలయంలో వివాహం చేసుకున్నాడని తెలిపింది. కొంత కాలం చాటుగా కాపురం చేసి, ఏవో కారణాలు చెబుతూ తనను తల్లిగారింట్లో వదిలేసి వెళ్లి పోయాడని ఆవేదన వ్యక్తం చేసింది. కాపురానికి తీసుకుపోకుండా మోసం చేశాడని వాపోయింది. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని వేడుకుంటున్నది.

## ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

వీణవంక, జూన్ 15: మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 120 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, గ్రామీణులకు సూపర్ స్పెషాలిటీ వైద్య పరీక్షలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు సురేందర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, వెంకటపాపయ్య, లచ్చయ్య, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, సిబ్బంది శ్రీకాంత్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి, జూన్ 15: కొలిమికుంట గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సుజాత-శ్రీనివాస్ గౌడ్ సౌజన్యంతో ఆదివారం ఆర్కిడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దాదాపు 154 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ చైర్మన్ వికాస్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ సత్తు తిరుపతి, మాజీ సర్పంచులు చొక్కాల్ల కన్నయ్య, నేరుమట్ల మల్లేశం, తోట ప్రభాకర్ రెడ్డి, నాయకులు సురేశ్, రాజు గౌడ్, నర్సయ్య, తిరుపతి, లక్ష్మీరెడ్డి, రాజన్న, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలు అమలు నెరవేరాలని మహాచండీయాగం



యాగం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

తిమ్మాపూర్, జూన్ 15: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేరాలని మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని శ్రీ తాపాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం మహాచండీయాగం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరు మారాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఫోరం జిల్లా చైర్మన్ కుమారస్వామి, అర్చకులు వెంకటాద్రి శర్మ, ఆలయ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు గంగాడి కృష్ణారెడ్డి, పురమల్ల శ్రీనివాస్, ఎడ్ల జోగిరెడ్డి, సుగుర్తి జగదీశ్వరాచారి, వివిధ పార్టీల నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

## 20 లోగా రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

హుజూరాబాద్ టౌన్/ కొత్తపల్లి, జూన్ 15: నూతనంగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు ఈనెల 20వ తేదీలోగా రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని హుజూరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు సునీత, కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారి కృష్ణ వేర్వేరు ప్రకటనల్లో సూచించారు. రైతులు వారి బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, నూతన పట్టాపాస్ బుక్ జిరాక్స్, దరఖాస్తు ఫారంతో జత చేసి నేరుగా తమ వ్యవసాయ క్లస్టర్ ఏఈవోకు దరఖాస్తు అందించాలన్నారు. అలాగే బ్యాంక్ ఖాతా పని చేయని రైతులు, బ్యాంక్ ఖాతా మార్చిడి చేయాలనుకునే రైతులు వెంటనే నూతన బ్యాంక్ ఖాతా వివరాలతో ఏఈవోను సంప్రదించాలని సూచించారు. పాత పట్టాదారులు భూ క్రయవిక్రయాలు చేసినా.. వారు తిరిగి దరఖాస్తు చేయవలసిన అవసరంలేదని తెలిపారు. ఈనెల 5లోగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులకు రైతు భరోసా వర్తిస్తుందని తెలిపారు.

## వినూత్న భావాల సమాహారం 'నాన్నకు ప్రేమతో..'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కమాన్‌చౌరస్తా, జూన్ 15 : వినూత్న భావాల పరంపర 'నాన్నకు ప్రేమతో' కవితా సంకలనమని తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత, ధర్మకేతనం సాహిత్య కళా పీఠం అధ్యక్షుడు ఎన్వీ రఘువీర్ ప్రతాప్ పేర్కొన్నారు. భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన పుస్తకావిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన నాన్నకు ప్రేమతో కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కవులు తమ తండ్రులను స్మరించుకుంటూ రాసిన కవితల సమాహారమే ఈ సంకలనమని తెలిపారు. పుస్తక పఠనం జీవితాల్లో మార్పులను తీసుకొస్తాయని అన్నారు. కవులు సమాజ హితం కోసమే రచనలు చేస్తారని, పాఠకులు తప్పనిసరిగా పుస్తకాలను చదవాలని కోరారు. విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తండ్రిని గౌరవించాలని, వారి ఆలనా పాలనా బాధ్యతలను విస్మరించకూడదని సూచించారు. ఇక్కడ బుస్స శ్రీనివాస్, నరహరి లక్ష్మా రెడ్డి, బొమ్మకంటి కిషన్, చిదంబరం, కూకట్ల తిరుపతి, పెంచాల రంగారావు, తడిగొప్పుల కుమారస్వామి, దుబ్బ భాస్కర రావు తదితరులు పాల్గొన్నారు.

## నాన్నే మార్గదర్శి..

- ఎంజేబీటీ జాయింట్ సెక్రటరీ జీవీ శ్యాంప్రసాద్ లాల్



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

కమాన్‌చౌరస్తా, జూన్ 15 : ప్రతి ఒక్కరి జీవితంలో నాన్నే మార్గదర్శిగా నిలుస్తారని, ఆయన చూపిన దారిలో పిల్లలు నడుస్తారని ఎంజేబీటీ జాయింట్ సెక్రటరీ జీవీ శ్యాంప్రసాద్ లాల్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఫిలిం సొసైటీలో ఆదివారం సమైక్య సాహితీ విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి శ్యాంప్రసాద్ లాల్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నాన్నల దినోత్సవం సందర్భంగా తన తండ్రిని గుర్తుచేసుకోవడం ఆనందంగా ఉన్నదన్నారు. గత ఎనిమిది సంవత్సరాల నుంచి విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం నిరాటంకంగా కొనసాగుతున్నదని తెలిపారు. ఈ క్రమంలో జీవీ శ్యాంప్రసాద్ లాల్ ప్రదాతగా ఆచార్య రజనీశ్రీ నృత్య పురస్కారం డాక్టర్ పేరిణి కుమార్‌కు, కేఎస్ అనంతాచార్య ప్రదాతగా కలకుంట్ల సంపత్ కుమారాచార్య సంగీత పురస్కారం లక్ష్మీ శేషాచార్యులకు, రావికంటి శ్రీనివాస్ ప్రదాతగా రావికంటి రామయ్య గుప్త సాహితీ పురస్కారం డాక్టర్ రంగాచార్యకు, మాడిశెట్టి గోపాల్ ప్రదాతగా మాడిశెట్టి మల్లయ్య ఉపాధ్యాయ పురస్కారం బెజ్జారపు వినోద్ కుమార్‌కు, డాక్టర్ రఘురామన్ ప్రదాతగా డాక్టర్ దారం నాగభూషణం పురస్కారం ఆచార్య అడపా సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గండ్ర లక్ష్మణ రావు, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, కొత్త అనిల్ కుమార్, డాక్టర్ బీవీఎన్ స్వామి, గాజుల రవీందర్, అనుపమ, డాక్టర్ శ్రీనివాసాచారి, నాగేంద్రశర్మ, నామని సుజనాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఫండస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి ఉషూ సెమినార్



సెమినార్‌లో పాల్గొన్న జిల్లాలకు చెందిన కోచ్‌లు

కొత్తపల్లి, జూన్ 15 : స్థానిక ఫండస్ పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి ఉషూ జడ్జింగ్ సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఉషూ అసోసియేషన్ అధ్యక్షుడు బార విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన 10 జిల్లాల నుంచి 50 మందికి పైగా కోచ్‌లు హాజరయ్యారు. ఉషూ అఫీషియల్స్ మహ్మద్ ఇమ్రాన్, ఇర్ఫాన్, పరమేశ్ పాల్గొని కోచ్‌లకు మెళకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉషూ సంఘం ప్రధాన కార్యదర్శి జాల మనోహర్, ఫండస్ పాఠశాల చైర్మన్ గోపు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్ చైర్మన్ గోపు సుశాంక్‌రెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, శంకరయ్య, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోడూరి శేఖర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Wanted Female Accountants, Qul: B.Com(Accounts), Exp: 2 Yrs in Tally Software, Job Location Karimnagar, Salary: 12K-15K per Month, Negotiable, Interested candidates can send resume: 8977919477 (Whatsup), email: anilcholleti.ca@gmail.com.
NTK-350007
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధమూ లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు (ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం, మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## కూతురు మృతిపై తల్లిదండ్రుల అనుమానం

- అత్తింటి వారిపై పోలీసులకు ఫిర్యాదు

శంకరపట్నం, జూన్ 15: తమ కూతురి మృతికి అత్తింటి వారే కారణమని అనుమానం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన బిగుల్ల లక్ష్మి-పరశురాములు దంపతుల కూతురు నవ్య (23), శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన ఆడెపు సందీప్ ప్రేమించుకొని పెద్దలను ఒప్పించి 2021 ఆగస్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కొడుకులు. కాగా, పెళ్లైన 6 నెలల నుంచే భర్త సందీప్, అతడి తల్లిదండ్రులు ఆడెపు కళ, సమ్మయ్య నవ్యను అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించారు. ఈ క్రమంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ సైతం జరిగింది. 10 రోజుల క్రితం రూ. 2 లక్షలు తేవాలని తిరిగి హింసించగా, తన ఇద్దరు కొడుకులను తీసుకుని నవ్య పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 13న సందీప్ తాను ఎలాంటి వేధింపులకు గురి చేయనని హామీ ఇవ్వడంతో నవ్య అతడిని నమ్మి, తల్లిదండులను ఒప్పించి అత్తవారింటికి చేరుకున్నది. అయితే నవ్య శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని సందీప్ సమాచారం ఇవ్వగా, ఆమె కుటుంబ సభ్యులు రోదిస్తూ కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. తమ కూతురు మరణానికి అత్తింటి వారే కారణమని అనుమానం వ్యక్తం చేస్తూ సందీప్‌తో పాటు అతడి తల్లిదండ్రులపై నవ్య తల్లి బిగుళ్ల లక్ష్మి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

## డిగ్రీ, పీజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, జూన్ 15 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ సమన్వయ కేంద్రం ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ కేంద్రం అధికారి డాక్టర్ వంగల శ్రీనివాస్, ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ ఇంటర్, ఐటీఐ రెండు సంవత్సరాలు పాలిటెక్నిక్ పాసైన వారు డిగ్రీ చదివేందుకు అర్హులు అని తెలిపారు. అలాగే పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు ఆగస్టు 13లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం అధ్యయన కేంద్రాల్లో లేదా సెల్ నంబరు 73829 29606లో సంప్రదించాలని సూచించారు.

## మా దారెటు..?

- డిపో దగ్గర రోడ్డుపై కందకంతో కాకతీయ కాలనీవాసుల ఇబ్బందులు



దారికి అడ్డంగా ఆర్టీసీ అధికారులు తవ్వించిన కందకం

హుజూరాబాద్, జూన్ 15: మా దారిలోనుంచి వెళ్లొద్దంటూ ఆర్టీసీ అధికారులు డిపో దగ్గర రోడ్డుకు అడ్డంగా కందకం తీయించడంతో స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఏండ్ల నుంచి ఉన్న దారిని మూసివేయడంతో మరో మార్గంగుండా తిరిగి ప్రయాణించాల్సి వస్తున్నదని వాపోతున్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద గల రోడ్డుకు కాకతీయ కాలనీలో గల ఓ రోడ్డు కలుస్తున్నది. ఈ రోడ్డు దాదాపు డిపో ప్రారంభమైనప్పుడే ఉందని కాలనీవాసులు చెబుతుండగా, తమకు ప్రభుత్వం స్థలం కేటాయించినప్పుడు ఈ దారి లింకు లేదని, అందుకే రోడ్డు అడ్డంగా కందకం తీశామని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. ఓ రోడ్డు నుంచి ఇంకో రోడ్డుకు వెళ్లాలంటే అనుసంధానం కావడం సహజమని.. ఎప్పటి నుండో నడుస్తున్న రోడ్డును మూసివేయడం తగదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు కలుగజేసుకొని దారికి గల అడ్డంకులు తొలగించాలని కోరుతున్నారు.

## 18లోగా సెల్ఫ్ రిపోర్ట్ చేయాలి

కమాన్‌చౌరస్తా, జూన్ 15 : డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి దోస్త్ రెండో విడుత సీట్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని, ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18లోగా తమ దోస్త్ వ్యక్తిగత లాగిన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ ప్రక్రియ పూర్తి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దోస్త్ మూడో విడుత అడ్మిషన్లు, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జూన్ 19వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

## వాసవీ ట్రస్ట్ చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు


కమాన్‌చౌరస్తా, జూన్ 15 : వాసవీ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆదివారం పలువురు అవసరార్థులకు రూ. 90వేల నగదుతో పాటు అవసరాల నిమిత్తం సామగ్రి అందజేసినట్లు ట్రస్ట్ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రతి నెలా సంకటహర చతుర్థి రోజు అవసరార్థులను గుర్తించి చేయూతనందిస్తామని చెప్పారు. ఇందుకోసం అభాగ్యులు, అవసరాలు కలిగిన వారు తమ పేర్లు ట్రస్ట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇక్కడ డైరెక్టర్లు, దాతలు ఉన్నారు.

## ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హుజూరాబాద్ టౌన్, జూన్ 15: ఆర్టీసీ యాజమాన్యం రిటైర్డ్ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు, ఆసరా పెన్షన్లు అందించాలని ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోస్కుల ముత్యంరాజు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 20న నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగు పండరి, రవీందర్, ప్రభాకర్, వెంకట్రాం నరసయ్య, రావుల రఘుపతి, బత్తిని సంజీవ్, నారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడి మృతికి సంతాపం

విద్యానగర్, జూన్ 15: వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జక్కని సంపత్ శనివారం రాత్రి 12 గంటలకు కరీంనగర్ కట్టారాంపూర్, తులసినగర్‌లోని ఇంట్లో మృతి చెందారు. సంపత్ మృతికి వీహెచ్‌పీఎస్, తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రులు, ఉద్యోగుల సంఘం బాధ్యులు, కొత్తూరు స్వామి, వెన్నం శ్రీనివాస్, నాయకులు, పలువురు సంతాపం తెలిపారు.



శంకరపట్నం: కేశవపట్నం హైస్కూల్‌లో చదివిన 1988-89 ఎస్సెస్సీ విద్యార్థులు, గురువులు



కోతిరాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

## పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

శంకరపట్నం, జూన్ 15: మండలంలోని కేశవపట్నం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు అంతా సోమవారం ఒక చోట కలుసుకున్నారు. తాము విద్య నేర్చుకున్న పాఠశాలలో 36 ఏండ్ల తర్వాత కలుసుకుని ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను పూలదండలు, శాలువాలతో సత్కరించారు. చిన్న పిల్లల్లా మారి ఆటపాటలతో రోజంతా సందడి చేశారు.

కమాన్‌చౌరస్తా, జూన్ 15 : జిల్లా కేంద్రంలోని కోతిరాంపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004 - 2005 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, సత్కరించారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

కరీంనగర్ రూరల్, జూన్ 15: మండలంలోని చెర్లభూత్కూర్ గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం సంఘం ప్రాంగణంలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా కూర అమరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పెండ్యాల చిన్న రాజురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దబ్బెట రమణారెడ్డి, కార్యదర్శిగా పెండ్యాల సంపత్‌రెడ్డి, కోశాధికారిగా పెండ్యాల రాజేందర్‌రెడ్డి, ఎన్నికయ్యారు. గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గానికి కరీంనగర్ సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు కూర శ్యాంసుందర్ రెడ్డి అభినందనలు తెలిపారు.